
# వాళ్ళలో ఒకడ్ని!

పచ్చిగోళ్ళ సుధ



ఒక్కసారిగా ఆకాశమంతా మబ్బులు అలిమేసాయ్! సన్నటి జల్లు కురుస్తోంది. ఆ వాతావరణం ఎంతో ఆహ్లాద కరంగావున్నా.. ..నా మనసులోమటుకు అల్లకల్లోలం చెలరేగుతోంది. వరండాలో అటూయిటూ పచార్లుచేస్తూ..... సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తున్నాను.

ఎంత మర్చిపోదామన్నా మరుపురాని, మరువలేని ఆ సంఘటన తన మనసుని పిండుతోంది. సంద్రంలో పిడుగు పడినంత అలజడి తన ప్రశాంత మనసు మందిరంలో...తుఫానురేపిన ఆ సంఘటతోనే తనో నిర్ణయానికి వచ్చాడు

కాలేజీలో ఆషాలతకు అవమానం జరిగింది. అదీ లెక్చరర్ వల్ల ఆషాలత అందగత్తె తెలివైన స్టూడెంట్ ఆమె కళ్ళలో కాంతి, ఎదుటివారిని ఆకట్టుకునే ఆకర్షణ ఆమెకు వరాలు కాదు. .. శాపాలుగా ఆమె జీవితంతో ఆడుకుంటున్నాయి. ప్రతిరోజు క్లాసుకువచ్చి పాఠాలు చెప్పవలసిన లెక్చరర్ ఆషాలత అందానికి ముగ్ధుడయి, ఆమెనే చూస్తూ, తనొక 'గురువు' అన్న విషయం పూర్తిగా మర్చిపోయి ఒకరోజు ఆ అమ్మాయి చెయ్యిపట్టుకున్నాడు.

అక్కడితో ఆగలేదు . . అలా... . అలా.. ప్రతిరోజూ ఆమెను ఎక్కడో ఒకచోట ఏదోవిధంగా తాకుతూ.....పరవశించిపోతున్నాడు. పాపం ఆ అమ్మాయి భయపడి ప్రిన్సిపాల్ కి చెప్పలేదు. కాలేజీలో న్యూసెన్స్‌గా తయారయింది యీ గొడవ. ఉదయం ఆషాలత క్లాసుకు వెళుతుంటే.....ఆ లెక్చరర్ ఆమె వెనుకే ఫాలోఅయి.....ఆమె బుగ్గమీద గాఢంగా ముద్దిచ్చి 'నిన్ను ప్రేమిస్తున్నాను ... పెళ్ళిచేసుకుంటాను' అన్నాడు

ఆమె దీనంగా 'ప్లీజ్.....నా జీవితంతో ఆడుకోకండి ....వదిలేయండి' ప్రాధేయపడుతుంటే అంతా చూస్తున్న నేను మరి అక్కడ నిలువలేక ఆ లెక్చరర్ కాలర్ పట్టుకున్నందుకు నాకు సస్పెన్షన్ సర్టిఫికెట్ బహూకరించింది కాలేజీ

నేను ఆ క్షణంలోనే గట్టి నిర్ణయం తీసుకున్నాను. ఎక్కడ ఏ ఆడపిల్లకు అన్యాయం జరిగినా. ...మనసున్న మనిషిగా అడ్డుపడాలని-తన జీవితం ఏమయినాకానీ....ప్రజాచైతన్యం చూడగలగాలని

నేను రూమ్‌కి వచ్చేసరికి నా తండ్రి వ్రాసిన లెటర్ వచ్చివుంది అర్జంటుగా తనని బయలుదేరి రమ్మని - ఏదో పెళ్ళి సంబంధాలు చూడాలని వ్రాశాడు నాకు వెళ్ళాలని లేకపోయినా వెళ్ళవలసిందే!

ఎందుకంటే.....ఈసారి లెటర్ రాదు లెటర్‌కి బదులు నాన్నే వచ్చేస్తాడు తుఫాను వచ్చినంత గొడవచేస్తాడు.

"వెళ్ళక తప్పదు. వెళ్ళకపోతే పెద్ద రాద్ధాంతం చేసేస్తాడు తండ్రి పెళ్ళిసంబంధాలంటూ సంవత్సరానికి ఆరునెలలు కాలేజీకి శలవుపెట్టించే తండ్రంటే . చిరాకు అనిపిస్తోంది. అయినా తండ్రి

మీద వున్న ప్రేమ తనని వెళ్ళేటట్టు చేస్తోంది. రెండుజతల బట్టలు బేగ్‌లో పడేసుకుని బస్టాండుకు నడిచాను.

బస్ టైమ్‌కి తొగలడదుగా. ఈ బస్సుల పరిస్థితి ఈ దేశ దీనస్థితి ఎవరికి తెలియంది కనుక. అలాగే బస్‌కోసం చూస్తూ కూర్చున్నాను. గంట గడిచాక నేను ఎక్కవలసిన బస్ కంగారుగా వచ్చి ఆగింది. బస్‌లోనుండి జనం చీమలబారులా దిగుతున్నారు. దిగేవారు దిగకుండానే ఎక్కేవారు ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. కండక్టర్ అరుస్తున్నాడు ఓసారి ఆగమని.

అక్కడ ఓ కురుక్షేత్రంలా వుంది. బలంవున్నవాడు ముందుగా ఎక్కగలుగుతున్నాడు. బలంలేనివాడు కింద మిగిలిపోతున్నాడు.ఆడవాళ్ళను తోసుకుంటూ....రాసుకుంటూమగవారుఎక్కేస్తున్నారు. 'లేడీస్ ఫస్ట్' అన్నమాట అక్కడ అర్థంలేకుండాపోయింది. ఆ తొక్కిసలాటలో ఓ ముసలావిడ పడిపోయింది. ఆవిడ్ని లేవదీసి ఓ పక్కన కూర్చోబెట్టాను. మరోఆమె పసిపాపతో బస్ ఎక్కలేక అవస్థపడుతోంది. ఆమె చేతిలోనుండి పాపను నేను తీసుకుని ఆమెను ఎక్కమన్నాను. అలా అందర్కి సాయపడుతూ చివరిగా నేను మిగిలిపోయాను.

బస్ కదులుతున్న సమయంలో ఒక్క వుదుటన బస్‌లోకి గెంతి, బస్ రాడ్‌ను పట్టుకుని వ్రేలాడుతున్నాను. రోడ్డుబాగోక కుదుపుగా వుంది. ఆ కుదుపుకు పక్కనవున్న ఆమెమీద పడ్డాను. సారీచెప్పేలోపే ఆమె లారీ తిట్లు తిట్టింది: అప్పుడు చూశాను ఆమెవైపు. ఆమె ఎవరోకాదు..... పాపను నాకిచ్చి బస్ ఎక్కిన ఆమె. కనీసం ఆ కృతజ్ఞత అయినా లేకుండా తిడుతోంది. నా ఆశయాలు, మంచితనం ఆమెముందు పనికిరాలేదు. ఛ వెధవ మనుషులు....సంస్కారంలేదు. వాళ్ళకోసం తాపత్రయపడి, సాయపడి తనకి సీటు లేకుండా చేసుకున్నాడు.... కానీ మిగిలింది ఏమిటి? ప్రశ్నించుకోకుండా వుండలేకపోయాను.

కండక్టర్ 'టిక్కెట్...టిక్కెట్' అని అరుస్తున్నాడు.

## వాళ్ళలో ఒకడ్ని!

పడిపోయిన ముసలావిడ ఏదో పేరు చెప్పి ఓ టిక్కెట్ అడిగింది డబ్బులిస్తూ.

"మరో పదిపైసలు యివ్వు" అన్నాడు కండక్టర్.

"లేవుబాబూ! పుణ్యముంటుంది. ముసలిముండని. పదిపైసలు వగ్గేయ్ బాబూ!" అర్థించింది.

"డబ్బుల్లేకుండా బస్సెలా ఎక్కావ్? అందరికీ అలవాటయిపోయింది పదిపైసలు నీ బాబు యిస్తాడనుకున్నావా? దిగవమ్మా. దిగు" నిర్లక్ష్యంగా అంటున్నాడు. వెంటనే నా జేబులోనుండి పదిపైసలు తీసియిచ్చాను. అతను టిక్కెట్ యిచ్చాడు.

అరగంట ప్రయాణం చేసాక ఓ వూరు వచ్చింది. అక్కడ బస్ చాలావరకూ ఖాళీ అయిపోయింది. గాలి పీల్చుకున్నాను. కాళీ అయిన సీట్లో కూర్చున్నాను. బస్ మళ్లీ కదిలింది.

ఉదయం 'వీక్లీ' తిరగేస్తూ చూస్తున్నాను. నా పక్కసీట్లో అతను 'ఓసారి ఆ పుస్తకం యిస్తారూ?' అడిగాడు. నేను చదవకపోయినా....నా పుస్తకమే కనుక ఎప్పుడయినా చదువుకోవచ్చునను కుంటూ ఆ పుస్తకాన్ని అతనికి అందించాను. అలా అందిస్తూ అప్పుడే చూశాను ఆ వెనుక సీట్లో కూర్చున్న ఆమెను.

ఆమె చాలా అందంగా వుంది. శరీరానికి పట్టిన చెమటను సుకుమారంగా కర్ఛీప్‌తో అద్దుకుంటోంది. తెల్లని తెలుపు-ఎర్రని పెదవులు నిజంగా అంతటి అందాన్ని కాలేజీలో కూడా చూడలేదు. పుస్తకాల్లో వర్ణించినట్టు కనుముక్కుతీరు ఎంతో అందంగావుంది. ఓసారి నావైపుచూసి, కళ్ళు దించేసుకుంది. ఇంత అందాన్ని ఈదేశంలో కాపాడుకోవాలంటే కష్టమే అనిపించింది.

కాలేజీలో తన స్నేహితుల మధ్య తీసుకున్న నిర్ణయం ఓసారి గుర్తుకు వచ్చింది. "ఎక్కడ ఏ అన్యాయం జరిగినా.....మనం ప్రతిఘటించాలిరా. చట్టం ఏదో చేస్తుందని, న్యాయం జరుగుతుందని ఆలోచిస్తూకూర్చుంటే.... నష్టం జరిగిపోకమానదు. వాక్స్వాతంత్ర్యం వున్న మనం మనదేశంలో వున్న లోటును గొంతెత్తి చాటుదాం. కట్నాలను కాటికి పంపుదాం. కన్నెలను కాపాడుదాం. యువత తలచుకుంటే.... చేయలేంది లేదురా.....యిది మనందరం మనస్ఫూర్తిగా తీసుకుంటున్న నిర్ణయం" అంటూ ఒకరిచేయి ఒకరుపట్టుకుని కలసికట్టుగా కార్యరూపంలో పెడదామనుకున్నాం.

నా ఎదుటిసీట్లో కూర్చున్నతను అస్తమానం వెనక్కి తిరిగిచూస్తున్నాడు. ఎవరివైపు చూస్తున్నాడాని గమనించాను. నేను అనుకున్నది కరక్టే. ఆ అందమయిన అమ్మాయివైపు అతను పదేపదే చూస్తున్నాడు.

అమ్మాయి కనిపించగానే ఆవురావురుమంటూ చూసే మగాళ్ళంటే..... నాకు అసహ్యం. వాడికి ఎలాయినా బుద్ధి చెప్పాలనుకున్నాను. నా ఆదర్శాలను - ఆశయాలను బ్రతికించుకోవాలనుకున్నాను. అతన్నే గమనిస్తున్నాను. ఓసారి పళ్ళికిలించాడు. ఆమెకూడా అభ్యంతరంలేనట్టు అతని

## 'కొంటె'సలహాలు

లైన్‌మెన్ రక్తం వేరొక పేషెంట్‌కు ఎక్కిస్తే ప్రతి కరెంట్ స్తంభం దగ్గర ఆగుతాడు.

*******

మరీ లావుగా వుండే పేషెంట్లను బల్లపై కాకుండా నేలపై పరుండబెట్టి పరీక్షిస్తే బల్ల రక్షించబడుతుంది.

*******

మీరు ఎం.డి. చదివినా తగిలించుకోకండి. ఎందుకంటే ఎం.డి. అంటే "మనీ దోచుకోవటం".

********

గర్భిణీ స్త్రీలను పచ్చి కోడిగ్రుడ్లను తినొద్దని చెప్పండి. లేకుంటే బిడ్డతో పాటు కోడిపిల్ల కూడా పుట్టొచ్చు!

-ఎ.యస్.యస్. శంకరరావు

వైపు చూస్తోంది.

ఆమె చూడ్డానికికూడా అర్థంలేక పోలేదు. అతనూ వయసులో వున్నాడు. అందగాడు. ఇద్దరి వయసులూ......పరిసరాలను, పరిస్థితులను గమనించేస్థితిలో లేవు. నాకుమాత్రం చాలా బాధగావుంది. అలా చూపులుకలుపుకుని 'ప్రేమ దోమ అంటూ అన్నీ అర్పించుకున్నాక, ఆ మగమహారాజు వచ్చినదారినే చక్కాపోతే....ఆ అందమయిన ఆడపిల్ల బ్రతుకు ఏంకాను?'

వాడు నవ్వితేమాత్రం...ఆమెకూడా నవ్వాలా? అదే నాకు నచ్చలేదు. అతన్ని పిలిచి అందరిలో బాగా చీవాట్లుపెడదామని నా మనసు వూరికే వుబలాటపడిపోతోంది. అయినా నిగ్రహించుకుంటున్నాను. మరికొంతసేపు చూడొచ్చు ఏమిచేస్తాడో అని...

ఐదు నిముషాలకు ఓసారి బుర్రతిప్పడంమాత్రం మానలేదు. గడియారంలో ముల్లయినా అలసిపోయి ఆగిపోతుందేమోకాని.....వాడి బుర్ర ఆగలేదు.

అంతలో బస్ ఆగింది.

మా వూరు వచ్చేసింది. ఆశ్చర్యపోయాను అసలు ప్రయాణం చేసినట్టేలేదు. నేను దిగడానికి సిద్ధమవుతున్నాను. అతనుకూడా దిగిపోతున్నాడు. అతనిదికూడా మావూరేనన్నమాట. అయితే గడ్డిపెట్టొచ్చు....అనుకున్నాను. ఆ తర్వాత ఆమెకూడా దిగిపోయింది. నాలో ఆశ్చర్యం. ఆమెది కూడా మావూరేనా....? లేక అతని కోసం....మరి ఆలోచించలేకపోయాను. వాళ్ళిద్దర్నీ వెంబడించాలి. ఆమెను కాపాడాలి. దృఢంగా అనుకున్నాను.

బస్ కదలబోతోంది. అప్పుడు గుర్తుకువచ్చింది కండక్టర్ నాకు చిల్లర యివ్వవలసిన విషయం. బస్‌తో పరిగెత్తుతూ అడిగాను. వాడు నా ముఖంలోకి అదోలా చూస్తూ, అర్ధరూపాయి కోసం అలాపరుగెత్తాలా? బస్‌కిందపడి చస్తావ్! అంటూ అర్ధరూపాయి అడుక్కునేవాడిచేతిలో పడేసినంత నిరసనగా పడేశాడు.

నాలో వుద్రేకం పెరిగింది. 'ఇందాక ముసలావిడ అర్థిస్తున్నా పదిపైసల కోసం కఠినంగా మాట్లాడిన నువ్వటరా.....నాకు చెప్పేది.....నీలాంటివాళ్ళను నేను చాలామందిని చూసాను. ప్రభుత్వం జీతం యిస్తున్నా.....ప్రజల సొమ్ము కాజేయాలనుకునే దొంగనాయాళ్ళుమీరు. మీకు శిక్షలేదు. అందుకే బడాదొంగతనం....!' అంటూ అక్కడ్నుంచి నడిచాను.

నా కళ్ళు వాళ్ళిద్దరికోసం వెదికాయి. వాళ్ళు యింకా అక్కడే తచ్చాడుతున్నారు. బహుశా రిక్షాకోసమయివుంటుంది. రిక్షాలోఅయితే ఎవరికీ కనిపించకుండాపోవచ్చునని వాళ్ళ ప్లాను కాబోలు. అది పల్లెటూరు కావడంవలన వున్నవే రెండు రిక్షాలు. వాటికూడా ఎప్పుడోకాని బేరంరాదు.

నేను కూడా అలాగే నిలబడ్డాను వాళ్ళను గమనిస్తూ. ఐదునిముషాలు అటూయిటూచూసి, యిద్దరూ ముందుకు నడవసాగారు. ఆ యిద్దరి వెనుకా కొంతదూరంలో నేను, వాళ్ళను ఫాలో అవుతున్నాను. ఆమె అతనికి బలికాకుండా ఆమెను కాపాడాలన్న ఆతృతే....వాళ్ళతో నడిపిస్తోంది.

వాళ్ళఎదురుగా సోడాకొట్టు రావుడు వస్తూ "దండాలయ్యా...ఏటిబాబూ...రిచ్చాలేదా? అమ్మగార్ని కాలినడకన తీసుకెళ్తున్నారు?" వినయంగా అడుగుతున్నాడు.

"ఒక్కరిక్షా కూడా లేదు రావుడూ. నా భార్యకు ఆరోగ్యం బాగోకపోతే....పట్నంలో చూపించివస్తున్నాను" అంటున్నాడు అతను.

అతని మాటలు విన్న నాకు మతిపోయింది. పిడుగుపడినట్లయింది. ఒక్కసారిగా ఉప్పెనవచ్చి నన్ను ముంచెత్తినట్టుగా అనిపించింది. సిగ్గు నా మనసునిండా నిండిపోయింది. పశ్చాత్తాపం నా నరాల్లో ప్రవహించసాగింది.

ఒక ఆడా మగా కలిసివెళితే.....నిందలువేసే ఈ సమాజాన్ని మార్చాలనుకునే తను.....వాళ్ళల్లో ఒకడిగా మిగిలిపోయాడు. అపర్థాల ఆచరణలో.....మంచితనం.. ...ముసుగులో.....తనూ అందరిలా ఆలోచించాడు.

అంతవరకూ ఆమెను కాపాడాలన్న ఆతృత తనకి వుత్సాహాన్నిచ్చింది. ఆనందాన్ని పంచింది. కానీ...భార్యా భర్తలను తను చెడుగా వూహించుకున్న వూహ గుర్తుకు వచ్చేసరికి మనసు సిగ్గుతో చచ్చిపోయింది.

నీరసంగా యింటివైపు అడుగులేశాను. ఈ సమాజం ఎప్పటికి మారుతుందో....ఇక నాకు నమ్మకంలేదు. ○

## చిత్రాల్లేని వినోద్‌ఖన్నా



అమెరికాలోని రజనీష్ ఆశ్రమం నుంచి తిరిగివచ్చాక వినోద్‌ఖన్నాకు చిత్రాల్లో మంచి అవకాశాలు వస్తాయనుకున్నారు కాని అవకాశం వచ్చిన చిత్రాలన్నీ ఫ్లాప్ అయిపోయాయి. వివాహానంతరం కూడా వినోద్ పరిస్థితిలో మార్పేమీ లేదు. చిత్రాలు ఫ్లాప్ అవటానికి అతని ప్రవర్తనే కారణమట. షూటింగ్‌లకు యిష్టం వచ్చినప్పుడు హాజరయి నిర్మాతలను ఏడిపిస్తుంటాడని అనేకమంది అంటున్నారు. ఇప్పుడు వినోద్‌ను బుక్‌చేసుకోండి అంటూ అతని చెంచాలు నిర్మాతల చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారు. కాని యింతవరకు ఏ నిర్మాతా గ్రీన్ సిగ్నల్ యివ్వలేదు. అయినా 'చేతులు కాలాక..... .... యిప్పుడు బాధపడి ప్రయోజన మేముంది?!